సన్మానం



మంత్రి వాకిటి శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్

అబిడ్స్: రాష్ట్ర నూతన మంత్రి వాకిటి శ్రీహరిని గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్ సన్మానించారు. ఆదివారం రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయనకు పుష్పగుచ్ఛం అందేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తలారి మలేష్ ముదిరాజ్, చంద్రశేఖర్ మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో బీసీలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే బీసీలు అన్నిరంగాల్లో రాణించే విధంగా పార్టీ కృషి చేస్తుందన్నారు.

జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్‌గా రాకేశ్ తివారీ



చార్మినార్: సుల్తాన్‌షాహి జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్‌గా రాకేశ్ తివారీ ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈసారి ఆషాఢమాసం బోనాలను వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారికి బోనాల సమర్పణ, అమ్మవారి ఘటాల సామూహిక ఊరేగింపు తదితర పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామన్నారు. నిజాం కాలం నుంచి ఇక్కడి అమ్మవారు పూజలందుకుంటుందన్నారు. ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల ఉత్సవాలకు ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని త్వరలో వెల్లడిస్తామన్నారు.

పవర్ బోర్ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న శ్యాంరావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట: శ్మశాన వాటికలలో సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని గ్రేటర్ కాంగ్రెస్ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్ అన్నారు. నల్లవాగు హిందూ శ్మశాన వాటికలో పవర్ బోర్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... శ్మశాన వాటికలల్లో నిరీక్షణ, స్నానాల గదులు, నీటి సదుపాయం, ప్రహరీ లాంటి నిర్మాణ పనుల విషయమై ఎప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి, బ్యాగరీ సంఘం ప్రతినిధులు పెరోజీ సాయినాథ్, సాయిలు, ప్రదీప్, జయమ్మ, సురేందర్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పని చేసే నాయకులకే గుర్తింపు



సమావేశంలో పాల్గొన్న అబ్బాస్‌హుస్సేన్

గోల్కొండ: మజ్లిస్‌పార్టీ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎమ్మెల్యే కౌసర్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషి చేస్తుందని సీనియర్ మజ్లిస్ నాయకుడు సయ్యద్ అబ్బాస్‌హుస్సేన్ అన్నారు. ఆదివారం హకీంపేట్‌లో నానల్‌నగర్, టోలిచౌకీ డివిజన్ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పని చేసే నాయకులకే గుర్తింపు ఉంటుందన్నారు. బస్తీ కమిటీ నాయకులకు ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ రఫత్‌హుస్సేన్, జబ్బార్, ఆబేద్ తదితరులున్నారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు సన్మానం

జియాగూడ: ఎస్సీ వర్గీకరణ తర్వాతే క్యాబినెట్ మంత్రిగా ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కు అవకాశం ఇవ్వడం సీఎం రేవంత్‌రెడ్డికే ఆ ఘనత దక్కుతుందని జియాగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జాయింట్ కార్యదర్శి, సోషల్ వర్కర్ మహేష్‌బాబు అన్నారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గానికి చెందిన ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కు క్యాబినెట్ మంత్రిగా గుర్తించడం వల్ల ఎస్సీ వర్గం సంతోషం వ్యక్తం చేస్తుందన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులతో కలిసి లక్ష్మణ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సతీష్, కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న మహేష్‌బాబు

చేప ప్రసాదం..పోటెత్తిన జనం

- కిక్కిరిసిన ఎగ్జిబిషన్ గ్రౌండ్
- ఉచితంగా స్వచ్ఛంద సంస్థల భోజనాలు
- పోలీసుల భారీ బందోబస్తు



దూద్‌బౌలిలో చేప ప్రసాదం అందజేస్తున్న నిర్వాహకులు



అబిడ్స్/గన్‌ఫౌండ్రీ: చేప ప్రసాదానికి పలు రాష్ట్రాల నుంచి జనం తరలివచ్చారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు బిహార్, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ, కర్ణాటకతో పాటు పలు ప్రాంతాల నుంచి ఆస్తమా రోగులు, వారి సహాయకులు తరలిరావడంతో ఎగ్జిబిషన్ గ్రౌండ్ కిక్కిరిసిపోయింది. పోలీసుతో పాటు జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు, రెవెన్యూ, విద్యుత్, ఇతర పలు శాఖల అధికారులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. నగర పోలీసు ఉన్నతాధికారులు ఆర్డీఓ, నాంపల్లి తహసీల్దార్ మన్నె ప్రేమ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణ, ఇతర పలు శాఖల అధికారులు రెండు రోజుల పాటు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చేయూతనందించిన స్వచ్ఛంద సంస్థలు..

మూడు రోజుల ముందు నుంచే వేలాది మంది ఆస్తమా రోగులు, వారి సహాయకులు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు తరలిరావడంతో హైదరాబాద్ జైస్వాల్ సమాజ్‌తో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు చేయూతని అందించాయి. జైస్వాల్ సమాజ్ అధ్యక్షుడు డాక్టర్ రేవంత్ జైస్వాల్, స్వరూప్ జైస్వాల్, డాక్టర్ సూర్యప్రకాష్ జైస్వాల్, రమేష్ జైస్వాల్‌తో పాటు పలువురు నాయకులు అల్పాహారాలు, భోజనాలు పంపిణీ చేశారు.



స్వచ్ఛంద సేవలందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు పప్పు మాత్రే తదితరులు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జాయింట్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్

సీసీ కెమెరాల ద్వారా నిఘా..

పోలీసులు సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంచారు. పోలీస్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్, అబిడ్స్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు. ఎగ్జిబిషన్ సొసైటీ కార్యాలయంలో సొసైటీ ఉపాధ్యక్షుడు నిరంజన్, కోశాధికారి డి.మోహన్, సీనియర్ నాయకులు వినయ్‌కుమార్ ముదిరాజ్, హన్మంత్‌రావు, రఘుపతి, పలువురు నాయకులు సొసైటీ కార్యాలయంలో చేప ప్రసాదాన్ని పంపిణీ చేయించారు.

నేడూ పాతబస్తీలో చేప ప్రసాదం పంపిణీ

చార్మినార్/దూద్‌బౌలి: ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ ముగిసిన అనంతరం సోమవారం దూద్‌బౌలిలో చేప ప్రసాదం అందజేస్తామని బత్తిని కుటుంబసభ్యులు వెల్లడించారు. ఆదివారం బత్తిని కుటుంబసభ్యులు చేప ప్రసాదాన్ని సేవించి ఉదయం 9:30 గంటలకు రోగులకు పంపిణీ అందజేశారు. ప్రతి ఏడాది ఇంటి వద్ద చేప ప్రసాదం పంపిణీ జరుగుతుందని సమాచారం ఉండడంతో స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలు అత్యధిక సంఖ్యలో చేరుకున్నారు. క్యూ పద్ధతిన వచ్చిన వారందరికీ బత్తిని కుటుంబసభ్యులు చేప ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానానికి భారీ బందోబస్తు నడుమ చేప ప్రసాదాన్ని తరలించారు. ఈ సందర్భంగా బత్తిని కుటుంబ సభ్యులు గౌరీ శంకర్ గౌడ్, దుర్గాగౌడ్, అనిరుద్ గౌడ్ మాట్లాడుతూ.. సోమవారం సైతం తమ ఇంటి వద్ద సాయంత్రం వరకు యధావిధిగా చేప ప్రసాదం పంపిణీ కొనసాగిస్తామన్నారు.



హైదరాబాద్ జైస్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో భోజనాలు అందజేస్తున్న దృశ్యం



దూద్‌బౌలిలో చేప ప్రసాదం కోసం క్యూ కట్టిన ప్రజలు



చేపప్రసాదం పంపిణీలో స్వచ్ఛంద కార్యకర్తలుగా బీఆర్ఎస్ నాయకులు మనోహర్ గైక్వాడ్ తదితరులు



చేపప్రసాదం పంపిణీలో బజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్.లక్ష్మణ్‌రావు

మూడేళ్లుగా తీసుకుంటున్నా..



మూడేళ్లుగా క్రమం తప్పకుండా చేపప్రసాదాన్ని తీసుకుంటున్నా. ఈ చేప ప్రసాదం తీసుకోవడం వల్ల ఎంతో ఆరోగ్యంగా ఉంటున్నా. ఈ ఏడాది మా కుటుంబ సభ్యులు సైతం ఈ చేపప్రసాదాన్ని స్వీకరించారు. న్యాచురల్ ఔషధాన్ని పంపిణీ చేయడం ఎంతో సంతోషకరం.

– అంజనేయులు, పాతబస్తీ

చాలా సంతోషంగా ఉంది..



చేప ప్రసాదం తీసుకోవడం వల్ల ఆస్తమా నుంచి ఉపశమనం లభించినట్లు ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఈ చేపప్రసాదాన్ని తీసుకుంటున్నా. ఆస్తమాకు మంచి ఔషధాన్ని ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులతో పాటు బంధువులకు సైతం తెలిపా.

– వీరేశలింగం, మెదక్

తాళ్లగడ్డ యువజన సంఘం అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్



సంఘం సభ్యులతో సీనియర్ నాయకులు

గోల్కొండ: తాళ్లగడ్డ యువజన సంఘం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలతో పాటు సమాజానికి మేలు చేసే కార్యక్రమాలను నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన భూనినెల్లి అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం తాళ్లగడ్డలో యువజన సంఘానికి అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్థానిక పెద్దల సహకారంతో యువజన సంఘం కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ప్రధాన కార్యదర్శిగా గుండారపు హనుమంతరావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు బస్తీ ప్రధాన సలహాదారులు గిరివాసుదేవయాదవ్, కోశ భద్రయ్య యాదవ్, మాజీ అధ్యక్షులు రాజగోపాల్‌యాదవ్‌లు పర్యవేక్షకులుగా వ్యవహరించగా దుర్గాదాస్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఘనంగా సన్మానించారు.

బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం



ఆలయాన్ని సందర్శిస్తున్న రాఘవేంద్ర, గురునాథ్‌రెడ్డి తదితరులు

గౌలిపురా: పటేల్‌నగర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని ఆదివారం ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేంద్ర, సభ్యులు గురునాథ్ రెడ్డి, వేణులు సందర్శించారు. ఈ సందర్భంగా గోపిశెట్టి రాఘవేంద్ర మాట్లాడుతూ..ఈసారి ఆషాఢమాసం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఆలయాల వద్ద అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రేణుకాఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సర్వేశ్ సతీష్ కుమార్, ఉపాధ్యక్షుడు గనతి కృష్ణ, కోశాధికారి జి.నరేశ్‌ముదిరాజ్, కార్యనిర్వాహక కార్యదర్శి డి.నవీన్, పటేల్‌నగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్, దుర్గేశ్, బంటి, డి.ప్రవీణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు



నాంపల్లి: భారత శాస్త్రీయ, జానపద, సంప్రదాయ నృత్య కళలు మానవ జీవనానికి మహత్తరమైన సంజీవని వంటివని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళారత్న సురభి ఆర్.వేణుగోపాల్ రావు అన్నారు. శివానంద లహరి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నాంపల్లిలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో శాస్త్రీయ నృత్య పరిశ్రమ ప్రదర్శనల ప్రదానోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్.వేణుగోపాల్ రావు మాట్లాడుతూ..ప్రముఖ అకాడమీ ఆఫ్ డాన్స్, మ్యూజిక్, ఫైన్ ఆర్ట్స్ సంస్థ శివానందలహరి విద్యార్థులు అద్భుతమైన కళాకారులుగా తీర్చిదిద్ది భారతీయ కళా సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడంలో అండె వేసిన చేయిని కొనియాడారు. కళాకారులు పుష్పాంజలి నృత్యం, ముకుంద ముకుంద, సరస్వతీదేవి స్తుతిగీతం, నటేశకౌత్వం, జతిస్వరం, భగవద్గీత శ్లోకాలు, స్వాగతం కృష్ణా, తిల్లానా అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.జమునా రాణి, గురు శ్యామల శ్రీనివాస్, కె.జయశ్రీ, సంస్థ అధ్యక్షుడు బి.వివేకానంద(రాజు), బి.జ్యోతి పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్‌లు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు పురస్కారాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం

గన్‌ఫౌండ్రీ: వీరశైవ లింగాయత్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఆకాంక్షించారు. ఆదివారం ఆదర్శనగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర వీర శైవ లింగాయత్ లింగ బలిజ సంఘం యువజన విభాగం ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..11 ఏళ్లుగా పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలను ఇవ్వడం అభినందనీయమన్నారు. వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పటేల్ సంగమేశ్వర్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పటేల్లపల్లి భరత్, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, హోప్ ఫౌండేషన్ చైర్మన్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలో రైడింగ్‌కు ఆదరణ పెరగాలి



గెలుపొందిన క్రీడాకారులతో విజయేందర్ సింగ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ నగరంలో పోలో రైడింగ్‌కు ఆదరణ పెరగాలని హైదరాబాద్ పోలో రైడింగ్ క్లబ్ ఉపాధ్యక్షుడు కె.విజయేందర్ సింగ్ అన్నారు. రెండు రోజులుగా హైదరాబాద్ పోలో రైడింగ్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న మాన్‌సూన్ క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు విశాల్ సింగ్, నరేన్ వెంకట్, వినిత, బషీరుద్దీన్ బాబుఖాన్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నాంపల్లి: ఎల్బీ స్టేడియంలో జూన్ 20న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి పిలుపునిచ్చారు. నాంపల్లిలోని దత్తాత్రేయ కాలనీలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబేద్కర్ నేతృత్వంలో యోగా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన లంకల దీపక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్బీ స్టేడియంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకకు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ అర్జున్, సొసైటీ సభ్యులు మహేష్, రాజగోపాల్, రవి, పవన్, ఆనంద్, కృష్ణారావు పాల్గొన్నారు.

సామాజిక సేవల్లో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం



నాగనాథ్ మాశెట్టిని సన్మానిస్తున్న కల్వ మల్లికార్జునప్ప

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం అని శ్రీశైలం దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యుడు, బసవ సంక్షేమ సమితి అధ్యక్షుడు కల్వ మల్లికార్జునప్ప అన్నారు. స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వంతో కలిసి పని చేస్తే ఆశించిన ఫలితాలుంటాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మృగశిర కార్తె సందర్భంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన చేప ప్రసాదం కోసం ఒకరోజు ముందుగా వచ్చిన దూర ప్రాంతాల ప్రజలకు టీఎస్ బసవ కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టి ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉదయం నుంచి రాత్రి వరకు ఉచితంగా ఆహార పదార్థాలను అందజేయడం అభినందనీయమన్నారు. ఈ మేరకు డాక్టర్ నాగ్‌నాథ్ మాశెట్టికి బొకే అందజేసి ఘనంగా సన్మానించారు.

పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఒక చక్కని చిత్రకారుడు శీలా వీర్రాజు అని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో శీలావీ సాహిత్య చిత్ర కళావేదిక ఆధ్వర్యంలో శీలా వీర్రాజు పురస్కారాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శీలా వీర్రాజు కథానిక పురస్కారాన్ని కేపీ.మునిసురేష్ పిళ్లైకి, చిత్రకళా పురస్కారాన్ని పీఎస్.చారికు అందజేశారు. అనంతరం శీలా అక్షరాలు, ఒక చిత్రకారుడు-కొన్ని ఆలోచనలు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు ఇంద్రగంటి మోహన కృష్ణ, రచయిత ఎంవీ రామిరెడ్డి, కవి విహారి, అమృత లత, శీలా సుభద్ర దేవి పాల్గొన్నారు.

వారాల సామాజిక వర్గాన్ని ఓబీసీలో చేర్చాలి



మాట్లాడుతున్న గాజుల చంద్రశేఖర్

చార్మినార్: వారాల సామాజిక వర్గానికి చెందిన ప్రజల సంక్షేమానికి తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర వారాల సంఘం అధ్యక్షుడు గాజుల చంద్రశేఖర్ అన్నారు. ఇందులో భాగంగా ఎప్పటి నుంచో తమ కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ విషయం ఇప్పటికే ఢిల్లీ వరకు వెళ్లి సంబంధిత ప్రభుత్వ ఉన్నతాధికారులను కలిసి పరిస్థితిని వివరించామన్నారు. వారాల సంఘం గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం బేగం బజార్ లోని శ్రీరామ్ మందిరంలో జరిగింది. రాబోయే రోజుల్లో సంఘం ఎన్నికలను ప్రజా స్వామ్య బద్ధంగా నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు గాజుల చంద్రశేఖర్ మాట్లాడుతూ..వారాల సామాజిక వర్గాన్ని వెంటనే ఓబీసీలో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు కందుకూరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమ్మటూరి విజయ్‌కుమార్, రాష్ట్ర ముఖ్య సలహాదారులు గాజుల కృష్ణ, రాష్ట్ర కోశాధికారి పొట్లపల్లి రమణయ్య, ప్రత్యేక ఆహ్వానితులు గాజుల అంజయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

10న జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట నిరసన



కార్యక్రమంలో వరద ముంపు ప్రాంతాల జేఏసీ నాయకులు

గౌలిపురా: హనుమాన్‌నగర్ ఫేజ్–2 కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం గౌలిపురా డివిజన్‌లోని వరద ముంపు ప్రాంతాల జేఏసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులందరూ కలిసి కార్యాచరణను ప్రకటించారు. ఈ నెల 10న దక్షిణ మండలం జోనల్ కమిషనర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. వరద ముంపు నుంచి అచ్చయ్యనగర్, హనుమాన్ నగర్, అంబికానగర్, పటేల్‌నగర్‌ను కాపాడాలని వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్‌నగర్ అధ్యక్షుడు గోపీ, సలహాదారులు శివనంద్రగిరి, చైర్మన్ నరసింహ గౌడ్, చంద్రమోహన్, అంబికానగర్ అధ్యక్షుడు మురళీ, దేవేందర్, దల్లు శివ, శ్రీరామ కోటయ్య, హనుమాన్‌నగర్ ఫేజ్–3 ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ గౌడ్, శ్రీనివాస్, పటేల్‌నగర్ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, సర్వేశ్, బుంగ శివ కుమార్, అచ్చయ్యనగర్ అధ్యక్షుడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



మంత్రి వివేక్‌కు అభినందనలు తెలుపుతున్న రాజువ్రసాద్ తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని గౌరవించే ప్రభుత్వం అని గడ్డం వివేక్ అన్నారు. మంత్రిగా నియమితులైన సందర్భంగా ఆయనను ప్రముఖ సంఘ సేవకుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎస్.రాజువ్రసాద్ కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్.రాజువ్రసాద్ మాట్లాడుతూ..దళితులు, బీసీలు, మైనార్టీలు కాంగ్రెస్ పార్టీలో గౌరవించబడుతున్నారన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం దళితులు, మైనార్టీలు, బీసీల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు చేపట్టిందన్నారు. ఆయనను కలిసిన వారిలో షేక్ మజహర్, వెంకటేష్ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి మజ్లిస్ కృషి

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి మజ్లిస్ పార్టీ నిరంతరం కృషి చేస్తూ ఉంటుందని మజ్లిస్ శాసన సభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఆయనను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హరూన్‌ఖాన్ తదితరులు అక్బరుద్దీన్‌ను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.



అక్బరుద్దీన్ ఒవైసీకి బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కౌసర్

అలరించిన ఎస్పీ బాలు సినీ గీతాలు



సినీ గీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సుల్తాన్‌బజార్: గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం ఆలపించిన సినీ గీతాలను పలువురు ఔత్సాహిక గాయకులు గానం చేసి స్వర నీరాజనం పలికారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో పద్మ విభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతిని పురస్కరించుకొని ఎస్‌పీ బాలు సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి సంగీత ప్రియులను అలరించింది. గాయకులు కృష్ణ, అనుదీప్, సాహితీ, సింహ, కృష్ణ చైతన్య, గాయత్రి, కృతి, శ్రీదేవి, జయంత్ తదితరులు శ్రావ్యంగా ఆలపించిన గీతాలు సంగీత ప్రియుల ప్రశంసలు అందుకున్నాయి. నిర్వాహకులు గోవింద్ ఆచార్య, చెన్నై హారే రాములు మాట్లాడుతూ..ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలు సంగీత ప్రపంచంలో చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. అనంతరం గాయని గాయకులను సత్కరించారు.